సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 12 । జనవరి । 2025



జానపదం ఝుల్లుమన్నది

రంగోయిలో కళాజాతర అలరించింది. ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

- 8లో



ఇళ్లకు పయనం

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి శనివారం నుంచి ఈ నెల 19వ తేదీ వరకు సెలవులు ప్రకటించారు. విద్యార్థులు క్యాంపస్ నుంచి ఆర్టీసీ బస్సుల్లో వెళ్లారు.

సోమవారం గ్రీవెన్స్ రద్దు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరగాల్సి ఉన్న మీకోసం పరిష్కార వేదిక (ఎస్పీ గ్రీవెన్స్) రద్దు చేసినట్లు ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. సోమవారం భోగి పండగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినం ప్రకటించినందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

నాడు సంక్షేమ సంక్రాంతులు



వైఎస్ జగన్ సర్కారు హయాంలో వివిధ వర్గాలకు సంక్షేమ పథకాలు అందించి వారిని ఆదుకున్నారు.

- వైఎస్సార్ ఆసరా: 4,67,232 మంది మహిళలకు రూ.1237.78 కోట్ల లబ్ధి
- వైఎస్సార్ సున్నా వడ్డీ: 5,57,866 మందికి రూ.176.38కోట్ల ఆర్థిక సాయం
- సున్నా వడ్డీ రాయితీ కింద 1,11,336 మంది రైతులకు రూ.32.54కోట్ల సాయం
- ఉచిత పంటల భీమా కింద 48,290 మంది రైతులకు రూ.643.99 కోట్ల పరిహారం
- జగనన్న చేదోడు: 15,200 మందికి రూ.55.83 కోట్ల మేర అర్థిక సాయం
- జగనన్న తోడు: 31,488 మందికి రూ.128.88 కోట్ల సాయం
- వైఎస్సార్ వాహన మిత్ర: 14,321 మందికి రూ.29.67 కోట్ల సాయం
- రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ: 19,770 మందికి రూ.9.31 కోట్ల మేర చెల్లింపులు
- నేతన్న నేస్తం: 1396 చేనేత కార్మికులకు రూ.15.26 కోట్లతో ప్రతీ నెలా రూ.3వేల పింఛన్

ఇలా చాలా సంక్షేమ పథకాల్ని వైఎస్ జగన్ వివిధ వర్గాలకు అందజేశారు.

నేడు చిన్నబోతున్న పెద్ద పండగ

కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన వెంటనే రైతన్నలకు రూ.20 వేలు ఇస్తామని ప్రకటించిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక గాలికొదిలేశారు. జిల్లాలోని 3,14,212 మంది రైతులకు సాయం అందలేదు.

- సంవత్సరానికి నాలుగు లక్షల ఉద్యోగాలు ఇస్తామని, ఉద్యోగం వచ్చే లోపు నిరుద్యోగికి నెలకి రూ.3వేలు చొప్పున ప్రకటించారు. ఇంత వరకు క్లారిటీ ఇవ్వలేదు. జిల్లాలో 7,28,210 మంది నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు.
- మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని ఎన్నికల ముందు చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణంపై ప్రకటన లేదు. • తల్లికి వందనం కింద రూ.15వేలు చొప్పున ఇస్తానని ఎన్నికల్లో చంద్రబాబు చెప్పారు. ఇద్దరు పిల్లలుంటే రూ.30వేలు.. ముగ్గురు ఉంటే రూ.45వేలు.. అని ఊదరగొట్టారు. నేటి వరకు 3,23,019 మంది తల్లులకు చిల్లిగవ్వ కూడా అందని పరిస్థితి.
- 19 ఏళ్ల నుంచి 60 ఏళ్ల లోపు మహిళలకు నెలకి రూ. 1500 ఇస్తామని చెప్పారు. జిల్లాలో ఈ పథకం కోసం 7,59,692 మంది మహిళలు ఎదురుచూస్తున్నారు.
- 50 ఏళ్లకే మహిళలకు పింఛన్ మంజూరు చేస్తామని చెప్పి.. మొండి చేయి చూపారు. జిల్లాలో 3,07,537 మందికి పైగా పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు.

వ్యాపారాలు లేవు



సంక్రాంతి వచ్చిందంటే పది రోజుల ముందు నుంచి వ్యాపారాలు కళకళలాడేవి. పండగ మూడే రోజులు ఉన్నా ఆ స్పీడ్ కనిపించడం లేదు. టౌన్ మొత్తం స్తబ్ధతగా ఉంది. **– కింతలి లక్ష్మణరావు, పండ్ల వ్యాపారి, కోవెలవీధి జంక్షన్, నరసన్నపేట**

కొనుగోళ్లు లేవు



పదేళ్లుగా నరసన్నపేటలో వ్యాపారం చేస్తున్నాం. పండగ వారం ముందు నుంచీ సేల్స్ బాగా ఉండేవి. ఇప్పుడు అలా లేవు. ఆన్‌లైన్ బిజినెస్ కొంత దెబ్బ కొడుతోంది. జనం దగ్గర డబ్బుల చెలామణీ కూడా తగ్గిపోయింది. **– నేతల గణేష్, ఫుట్‌పాత్ వస్త్ర వ్యాపారి**

ధాన్యం కొనుగోలు చేయాలి..



ధాన్యం కొనుగోలు చేయాలి. నేను 70 బస్తాలు ఇచ్చాను. మరో 150 బస్తాలు ఉన్నాయి. వీటిని కూడా కొనుగోలు చేయాలి. టార్గెట్ పేరుతో కొనుగోళ్లు ఆపేస్తే మాలాంటి రైతుల మాటేమిటి. **– అరవల సూర్యనారాయణ, పోతయ్యవలస**

తాకిడి లేదు..



గతంలో మాల్స్‌లో కాకుండా మిగతా దుకాణాల్లో రూ.40 కోట్ల వస్త్ర వ్యాపారం జరిగేది. ఈ సారి రూ. 20 కోట్లకు మించే పరిస్థితి కనిపించడం లేదు. గతంలో ఉన్నంత కొనుగోలు తాకిడి లేదు. దానికి తోడు ఆన్‌లైన్ వ్యాపారం బాగా పెరిగిపోయింది. కార్పొరేట్ షాపులు వచ్చేయడమూ వ్యాపారం తగ్గడానికి ఓ కారణమే. **– బరాటం చంద్ర, వస్త్ర వ్యాపారి, శ్రీకాకుళం**

కాంతి లేని సంక్రాంతి

- సంక్రాంతికి మార్కెట్‌లో కనిపించని జోష్
- సంక్షేమ పథకాల్లేక పేద, మధ్య తరగతి ప్రజలకు తప్పని ఆర్థిక సమస్యలు
- పండిన పంటను అమ్ముకోలేక రైతుల అవస్థలు
- ఏటా ఈ సమయానికి రూ. 500కోట్లకు పైగా వ్యాపారం
- ఈసారి రూ.250 కోట్లకు మించని వైనం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

రెండు రోజుల్లో పెద్ద పండగ. అన్ని వర్గాల వారూ ఆనందంగా జరుపుకునే వేడుక. ఇప్పటికే పిల్లాపాపలతో కలిసి షాపింగ్‌లు పూర్తి చేస్తారు. కానీ మార్కెట్‌లో ఈ ఏడాది అంతగా జోష్ కనిపించడం లేదు. ఏటా ఈ సీజన్‌లో అన్నీ కలిపి రూ.500 కోట్ల వరకు వ్యాపారాలు జరిగేవి. ఈ ఏడాది మాత్రం రూ.250 కోట్లకు మించడం లేదు. నెలగంటు పెట్టిన నాటి నుంచి సంక్రాంతి వరకు వ్యాపారులకు సీజన్ అద్భుతంగా నడిచేది. కానీ ఈ ఏడాది మాత్రం అనుకున్న స్థాయిలో వ్యాపారం సాగలేదని వారు చెబుతున్నారు.

ఓ వైపు నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. మరోవైపు పేద, మధ్య తరగతి వర్గాల చేతిలో డబ్బులు కూడా లేకపోవడంతో ఈ ఏడాది మార్కెట్‌లో కళ కనిపించడం లేదు. గతంలో ఎప్పుడూ ఇలాంటి గడ్డు పరిస్థితి చూడలేదని ప్రజలే కాదు వ్యాపారులు కూడా వాపోతున్నారు. క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి పండగల నేపథ్యంలో కొనుగోలుదారులతో నెల రోజుల పాటు కళకళలాడే మార్కెట్లు ఈ ఏడాది కొనుగోళ్లు లేక వెలవెలబోతున్నాయి.



ఇప్పటికే క్రిస్మస్ అమ్మకాలు సగానికి పైగా పడిపోగా సంక్రాంతి వ్యాపారాలు అలాగే ఉన్నాయి. సాధారణంగా క్రిస్మస్ మొదలుకుని సంక్రాంతి పండగ వరకు వస్త్ర, కిరాణా, బంగారం వ్యాపారాలు భారీగా జరుగుతాయి. ఈ పండగల కోసం నెల రోజుల ముందుగానే వ్యాపారులు ముంబై, కోల్‌కతా, ఢిల్లీ, హైదరాబాద్ ఇతర ప్రాంతాల నుంచి భారీ మొత్తంలో సరుకు తెచ్చుకుంటారు. చిన్న వ్యాపారులు సైతం రూ.లక్షల్లో కొనుగోలు చేసి దుకాణాలు పెడతారు. కార్పొరేట్ దుకాణాల్లో కాస్తోకూస్తో హడావుడి కనిపిస్తున్నా మిగతా దుకాణాల్లో పరిస్థితి దయనీయంగా ఉంది.



శ్రీకాకుళం నగరంలో జీటీ రోడ్డు

ఏదీ సంక్షేమం..?

గత ఐదేళ్లు వైఎస్ జగన్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేసి, డీబీటీ ద్వారా ప్రజల ఖాతాలకు నిధులు జమ చేసేది. దీంతో పండగలు వచ్చాయంటే తమకు కావల్సినవన్నీ కొనుగోలు చేసుకునే వారు. ఫలితంగా మార్కెట్లు కిటకిటలాడేవి. కరోనా వంటి సమయంలో కూడా వ్యాపారాలు చక్కగా జరిగాయి. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక పథకాల అమలు ఆగిపోయింది. దీంతో సామాన్యుల చేతిలో డబ్బుల్లేని పరిస్థితి నెలకొంది. ఆ ప్రభావం మార్కెట్‌పై పడుతోంది.

● అన్ని వ్యాపారాలు అంతే..

జిల్లా వ్యాప్తంగా పట్టణాల్లో గుర్తింపు ఉన్న దుకాణాలు వెయ్యి వరకు ఉన్నాయి. వీటిలో సరాసరి రూ. 500 కోట్ల వ్యాపారం జరిగేది. ముఖ్యంగా వస్త్ర వ్యాపారం బాగా పడిపోయింది. బంగారు దుకాణాలు అలాగే ఉన్నాయి. కిరాణా, అలంకరణ దుకాణాలు, చెప్పుల వ్యాపార పరిస్థితి కూడా అంతంతమాత్రంగానే ఉంది. ఈ ఏడాది ఇప్పటివరకు నాలుగో వంతు వ్యాపారం జరిగింది. మరో రెండు మూడు రోజుల్లో మరో వంతు వ్యాపారం జరిగే అవకాశం ఉంది. ఈ లెక్కన రూ.250కోట్లు దాటే అవకాశం లేదు. సంక్రాంతికి పిండి వంటల తదితరాల తయారీకి అవసరమైన వస్తువులు కొనుగోలు చేసేందుకు నగరంతో పాటు జిల్లా వాసులు శ్రీకాకుళానికి పోటెత్తేవారు. ఈ క్రమంలో ఏటా సందడి నెలకొనేది. అయితే ఇప్పుడా పరిస్థితి అంతగా కనిపించడం లేదు. నిత్యావసర సరుకులు ధరలు పెరిగిపోవడంతో రెండు కిలోలు కొనాల్సిన వాళ్లు కిలో, అరకిలోతో సరిపెట్టుకుంటున్నారు. ఫలితంగా కిరాణా దుకాణాలపై కూడా ప్రభావం పడింది.

అన్నదాత డీలా..

సంక్రాంతి అంటేనే అన్నదాతల పండగ. కానీ ఆ వేడుక అనుకున్న స్థాయిలో చేసుకోలేని స్థితిలో రైతన్నలు ఉన్నారు. ఆరుగాలం కష్టించి చేతికొచ్చిన పంటను అమ్ముకోలేక అష్టకష్టాలు పడుతున్నారు. పండిన పంటను సకాలంలో కూటమి ప్రభుత్వం కొనుగోలు చేయలేదు. ఈ లోపు వర్షాలు పడటంతో చేతికందిన పంట తడిచి ముద్దయ్యింది. దీంతో దళారులే దిక్కయ్యారు.

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 3.83లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసింది. దాదాపు లక్షా 17వేల మెట్రిక్ టన్నులు ఇంకా రైతుల వద్దే ఉన్నాయి. దీంతో పెద్ద పండగ ముందు ఇబ్బంది తప్పడం లేదు.



ప్రభుత్వ చేయూత కరువు



ప్రస్తుత ప్రభుత్వం ఏ వర్గానికి చేయూతని ఇవ్వడం లేదు. గతంలో సంక్షేమ పథకాల డబ్బులు వచ్చేవి. దీంతో జనం వద్ద డబ్బుండేది. వ్యాపారాలు జరిగేవి. ఈ సారి అలా లేదు. **– దాంపురం రాజ్యలక్ష్మి, శివశంకర్ కాలనీ, పాతపట్నం**

ధాన్యం కొనుగోళ్లు లేవు..




ప్రభుత్వ పరంగా ధాన్యం కొనుగోళ్లు జరగడం లేదు. ప్రకటనలకు తగ్గట్టుగా క్షేత్రస్థాయిలో పనులు జరగడం లేదు. గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా వచ్చేది. ఇప్పుడు అది లేదు. **– పడాల రంజీత్, గంగువాడ గ్రామం, పాతపట్నం మండలం**

సగానికి పడిపోయింది..

సంక్రాంతి నేపథ్యంలో రూ.5కోట్ల వరకు బంగారు వ్యాపారాలు జరిగేవి. ఇప్పుడు రూ.2 కోట్ల నుంచి రూ.2.50 కోట్ల వరకే వ్యాపారం జరిగింది. గత ఏడాది కంటే బంగారం ధరలు పెరగడం కూడా ఒక కారణం. కార్పొరేట్ జ్యూయలరీ షాపులు కూడా ప్రభావం చూపాయి. **– ఊణ్ణ కృష్ణారావు, సత్య జ్యూయలర్స్, శ్రీకాకుళం.**

ఆనందుడు నేర్పిన బాట..

జాతీయ యువజన దినోత్సవం నేడు



మందలో ఉండకు
వందలో ఉండు

ప్రయత్నం చేసి ఓడిపో..
కానీ ప్రయత్నం
చేయడంలో మాత్రం
ఓడిపోకు..

పది మంది యువకుల్ని
నాకివ్వండి.. దేశ
స్వరూపాన్నే మార్చేస్తాను..

మనం హీనులమని
భావించుకుంటే..
నిజంగానే
హీనులమైపోతాం

గుండవల్లి పేటలో అమ్మవారి గుడి వద్ద ఏర్పాటు చేసిన వివేకానందుడి విగ్రహం

'మీ సొంత దారిలో పయనించండి.. ఇతరులుగా మారిపోకండి..' వివేకానందుడు మానవాళికి ఇచ్చిన అతిగొప్ప సందేశాల్లో ఒకటి ఇది. ఇలా సొంత దారులు వెతుక్కుని పదిమందికీ ఆదర్శంగా నిలిచిన వారు జిల్లాలో ఎంతోమంది ఉన్నారు. సేద్యం మర్చిపోతున్న తరుణంలో ఒకరు సాగును వృత్తిగా చేసుకున్నారు. తోటివారి కోసం పాటు పడుతూ జీవితాన్ని మరొకరు సార్థకం చేసుకుంటున్నారు. యువకుల్లో నివురు గప్పిన నిప్పులా ఉన్న శక్తిని మేల్కొలిపేందుకు ఇంకొందరు గ్రామాల్లో అపురూప కార్యక్రమాలు చేపడుతున్నారు. నేడు యువజన దినోత్సవం. ఈ సందర్భంగా ఆదర్శప్రాయుల గురించి..

● వివేకానందుడే స్ఫూర్తి



విశ్వనాథం

నరసన్నపేట: వివేకానందుడి స్ఫూర్తితో మండలంలోని గుండవల్లిపేటలో పంచిరెడ్డి విశ్వనాథం అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు. సొంత నిధులతో వివేకానందుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. రూ.5 లక్షలతో స్వర్గధామన్ని నిర్మించారు. స్కూల్‌లో గాంధీ, సరస్వతీ దేవి విగ్రహాలను ఏర్పాటు చేశారు. స్థానిక ఉమా సహిత స్వయంభువేశ్వరాలయాన్ని పునర్నిర్మించారు. ఇదే ప్రాంగణంలో కల్యాణ మండపం నిర్మించి పేదలకు తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉంచారు.


● సొంతూరే మేలంటూ..



శ్రీనివాసరావు

నరసన్నపేట: సేద్యం అంటేనే అసాధ్యం అంటున్న నేటి తరంలో డిగ్రీ చదివిన ఓ కుర్రాడు వ్యవసాయాన్ని వృత్తిగా స్వీకరించాడు. ఎక్కడో పట్నం వెళ్లి పని చేయడం కంటే ఉన్న ఊళ్లో సాగుచేయడం మేలని తలిచాడు. నరసన్నపేట మండలం కిల్లాం గ్రామానికి చెందిన గొలివి శ్రీనివాసరావు బీకాం అయ్యాక.. హైదరాబాద్ వెళ్లాడు. అక్కడ రూ.50 వేలు వచ్చే ఉద్యోగం వదిలిపెట్టి స్వగ్రామంలోనే కూరగాయలు పండిస్తూ నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. గ్రామాన్ని, తల్లిదండ్రులను, భార్యాబిడ్డలను వదిలి ఎక్కడో బతకడం ఎందుకని కిల్లాం వచ్చేసి వ్యవసాయం చేయడం ప్రారంభించాడు. 1.80 ఎకరాలు కౌలుకు తీసుకుని కూరగాయలు సాగు చేయడం ప్రారంభించి.. మరో పది మందికి ఉపాధి కల్పిస్తున్నాడు.

● యువ 'చైతన్యం'



చైతన్యకుమార్

శ్రీకాకుళం కల్చరల్: రెండు దశాబ్దాలుగా రక్తదానం, నేత్రదానం, రక్త సేకరణ, అవయవ దానం, మొక్కలు నాటడం వంటి సామాజిక సేవను నిర్వహిస్తూ పెంకి చైతన్యకుమార్ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆయన 2005 నుంచి రెడ్‌క్రాస్‌లో మోటివేటర్‌గా చేరి ఎన్నో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి ఇప్పటికి లక్షా ఏభైవేలు యూనిట్ల రక్తం సేకరించారు. నేత్రదానంపై కూడా అవగాహన కల్పిస్తూ ఇప్పటికి 100 మంది వద్ద నుంచి నేత్రసేకరణ చేశారు. ప్లాస్మా డొనేషన్ ద్వారా 100 కార్నియాలు సేకరించారు.

● యువతకు ఆదర్శం..



లక్ష్మణరావు

జి.సిగడాం: సంతవురిటి గ్రామానికి చెందిన బుడారి లక్ష్మణరావు సర్పంచ్‌గా పనిచేస్తూ సేవలు చేస్తున్నారు. సొంత నిధులతో ఇటీవల 15 అడుగుల సీతారామరాజు విగ్రహం ఏర్పాటు చేశారు. అసిరితల్లి అమ్మవారి గుడి నిర్మాణం, పేదలకు ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేశారు. మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేశారు. కృష్ణా పార్క్‌ని తీర్చిదిద్దారు.

● నిరుపేదలకు బాసటగా...

టెక్కలి: టెక్కలి మండలం నరసింగపల్లి గ్రామానికి చెందిన యువకులు విద్యా, వైద్యం, నిరుపేదలకు సాయం చూస్తూ స్ఫూర్తి నింపుతున్నారు. నరసింగపల్లి సేవా సంఘంతో సామాజిక కార్యక్రమాలు చేస్తున్నారు. గ్రామానికి చెందిన వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల్లో స్థిర పడిన వారంతా తమకు తోచిన సాయంగా సామాజిక కార్యక్రమాలు చేస్తున్నారు. 2020లో ఈ సేవను ప్రారంభించారు. వైద్యం కోసం సాయం చేయడం, ఆసరా లేని నిరుపేదలను ఆదుకోవడం చేస్తున్నారు. ఊరిలో లైబ్రరీ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను అందజేస్తున్నారు.



నరసింగపల్లి గ్రామంలో నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న సంఘసభ్యులు

భోగిమంట.. ముందేనంట



కొత్తూరు మండలం కర్లెమ్మలో భోగి ముందురోజు అర్ధరాత్రి వేడుక (ఫైల్)

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి బెల్లుపడ గ్రామంలో భోగి పండగకు ఒక రోజు ముందుగానే భోగి మంటలను వేయడం ఆనవాయితీగా వస్తోంది. గ్రామంలో మెజారిటీ రైతులే ఉన్నారు. భోగి పండుగకు ముందుగానే ధాన్యలక్ష్మిని ఇంటికి చేర్చడం వీరికి అలవాటు. దీంతో ప్రతి ఇంటికి లక్ష్మీదేవి చేరిందనే సంతోషంతో భోగి పండుగకు ఒకరోజు ముందుగానే గ్రామంలో లభించే కర్రలను ఒక దగ్గరకు చేర్చి మంటలు వేసేవారు. భోగి పండగ రోజున మాత్రం ఆవుపేడతో తయారుచేసిన పిడకలనే మాత్రమే ఆ మంటలలో వేసి పూజలు చేసేవారు. ఆ సంప్రదాయం అలా కొనసాగుతోంది.

కర్లెమ్మలో..

కొత్తూరు: కొత్తూరు మండలంలోని కర్లెమ్మ గ్రామంలో భోగి ముందు రోజు అర్ధరాత్రికి భోగి మంటకు గ్రామ పెద్దలు నిప్పంటిస్తారు. భోగి రోజు యథావిధిగా చిన్నారులు భోగి మంటలు వద్దకు చేరుకొని భోగి పిడకలను వేసి మొక్కుతారు. నరసన్నపేట మండలం బడ్డవానిపేటలో ఆదివారం సాయంత్రం భోగి మంట వేయనున్నారు.

'సమీకృత కలెక్టరేట్ పనులు పూర్తి చేయండి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: సమీకృత కలెక్టర్ కార్యాలయ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న సమీకృత కలెక్టర్ కార్యాలయ భవన సముదాయాన్ని జిల్లా రెవెన్యూ అధికారి రహదారులు, భవనాల శాఖ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. నూతన కలెక్టరేట్ ఆవరణలో పార్కింగ్, సెక్యూరిటీ, ప్రహరీ నిర్మాణం తదితర పనులపై ఆర్ అండ్ బీ ఎస్ఈ, కాంట్రాక్టు ప్రతినిధి ఆరాతీయగా సంబంధిత మ్యాప్‌ను చూపించి వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నాణ్యతలో రాజీ లేకుండా పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.

జిల్లాకు చెందిన ఇద్దరు డీసీలకు పోస్టింగ్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాకు చెందిన చెందిన ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లకు ప్రభుత్వం పోస్టింగ్‌లను ఇచ్చింది. గత మూడు నెలలుగా వీరికి పదోన్నతి పొందినప్పటికీ ఇప్పటి వరకు వీరికి పోస్టింగ్‌లు ఇవ్వలేదు. వీరికి పోస్టింగ్‌లు ఇస్తూ శుక్రవారం 66 జీఓను విడుదల చేసింది. జిల్లాకు చెందిన డిప్యూటీ కలెక్టర్ ఎం.సింహాచలంకు విశాఖపట్నం ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. మరో డీసీ సాధు దిలీప్ చక్రవర్తికి పార్వతీపురం మన్యం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిగా పోస్టింగ్ ఇచ్చారు.

ఒప్పో రెనో 13 సిరీస్ ఫోన్ల విడుదల



ఒప్పో రెనో 13 సిరీస్‌ను లాంచ్ చేస్తున్న సినీ హీరోయిన్ డింపుల్ హయాతి, సెల్‌పాయింట్ ఇండియా చైర్మన్ మోహన్‌ప్రసాద్ పాండే, బాలాజీ పాండే

డాబాగార్డెన్స్: సెల్ పాయింట్ ఇండియా ఒప్పో రెనో 13 సిరీస్‌ను శనివారం లాంచ్ చేసింది. డాబాగార్డెన్స్‌లోని సెల్‌పాయింట్ షోరూంలో సెల్ పాయింట్ ఇండియా చైర్మన్ మోహన్ ప్రసాద్ పాండే నేతృత్వంలో సినీనటి డింపుల్ హయాతి ఒప్పో రెనో 13 సిరీస్‌ను మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెల్‌పాయింట్‌లో ఒప్పో రెనో 13 సిరీస్ లాంచ్ చేయడం ఆనందంగా ఉందన్నారు. ఏ కంపెనీ అయినా అప్‌డేటెడ్ మొబైల్ మార్కెట్‌లోకి అందుబాటులోకి తెచ్చిందంటే.. అది ముందుగా సెల్‌పాయింట్‌లో ఆవిష్కరణ అవుతుందన్నారు. విశాఖపట్నంలో సెల్‌ఫోన్లకు సంబంధించి సెల్‌పాయింట్ అడ్డాగా మారిందన్నారు. మంచి ఫీచర్స్‌తో ఒప్పో రెనో 13 సిరీస్ మార్కెట్లో అందుబాటులో ఉందన్నారు. మోహన్ ప్రసాద్ పాండే మాట్లాడుతూ విశాఖపట్నంలో తొలిసారిగా డైమండ్ పార్క్ వద్ద సెల్‌పాయింట్‌ను ప్రారంభించామన్నారు. అంచెలంచెలుగా ఎదుగుతూ విశాఖలో 29, రాష్ట్ర వ్యాప్తంగా 82 సెల్‌పాయింట్ స్టోర్లకు విస్తరించినట్లు వివరించారు. 25 ఏళ్లుగా నాణ్యత గల ఉత్పత్తులు, వినియోగదారుల సేవలందించడంలో సెల్‌పాయింట్ విశ్వసనీయతగా నిలిచిందన్నారు. నూతన ఒప్పో రెనో 13 సిరీస్ కొనుగోలుపై లక్కీ డిప్ ద్వారా బైక్‌తో పాటు పలు బహుమతులు అందజేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సెల్‌పాయింట్ ప్రతినిధి బాలాజీ పాండే, పోతు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీదేవికి నోట్ల కళ

సారవకోట: మండలంలోని చీడిపూడి వేంకటేశ్వర స్వామి ఆలయంలోని లక్ష్మీదేవిని శనివారం లక్షల రూపాయల కరెన్సీ నోట్లతో అలంకరించారు. అలంకరణకు రూ.10, 20, 50, 100, 200 రూపాయల నోట్లను వినియోగించినట్లు అర్చకులు రామానుజాచార్యులు తెలిపారు. ఆలయంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా అమ్మవారిని కరెన్సీతో అలంకరించమన్నారు. అలాగే ఆలయ ప్రాంగణంలో మొక్కులు తీర్చుకునేందుకు పలువురు చిన్నారులకు కలాకండలతో తులాభారం నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

కరెన్సీతో కళకళలాడుతున్న లక్ష్మీదేవి

పింఛన్‌దారుల లైఫ్ సర్టిఫికెట్ల సమర్పణకు సహాయం

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో పింఛన్‌దారులకు లైఫ్ సర్టిఫికెట్లను సకాలంలో సమర్పించాలని.. ఇందు కోసం ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా సంఘం ఆధ్వర్యంలో తమవంతు సహకరిస్తామని జిల్లా సంఘ ప్రతినిధులు శనివారం తెలిపారు.

ఇంతవరకు 720 మందికి నేరుగా, కదలలేని స్థితిలో ఉన్నవారు 90 మందికి లైఫ్ సర్టిఫికెట్లను అందజేసినట్టు పేర్కొన్నారు. ఈ మేరకు ఎన్జీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర సంఘ ఉపాధ్యక్షులు ఎంఎస్ఆర్ ప్రకాశరావు, జిల్లా సంఘ అధ్యక్షులు పి.ఎస్.ప్రసాదరావు, జిల్లా సంఘ ప్రధాన కార్యదర్శి నరిసింహమూర్తి పాల్గొన్నారు.

జానపదం ఝుల్లుమన్నదీ..

● రంగోయిలో అలరించిన కళాజాతర



తప్పెటగుళ్ల ప్రదర్శనలో పీత గంగయ్య బృందం



సాలిన జోగారావు బృందం ఆటా పాటా

పలాస: జానపదం ఝుల్లుమన్నది. కళాకారులు తమ కళను ప్రదర్శించి ప్రేక్షకులను ఉల్లాసపరిచారు. దీనికి పలాస మండలం రంగోయి గ్రామం వేదికైంది. గిడుగు రామ్మూర్తి తెలుగు భాషా జానపద కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు బద్రి కూర్మారావు ఆధ్వర్యంలో శనివారం రంగోయి గ్రామంలో నిర్వహించిన జానపద కళాజాతర అబ్బురపరిచింది. 21 ఏళ్లుగా గ్రామంలో జరుగుతున్న ఈ కార్యక్రమానికి సంక్రాంతి సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి జానపద కళాకారులు పెద్ద ఎత్తున చేరుకొని తమ హావభావాలతో ప్రేక్షులను మంత్ర ముగ్ధులను చేస్తారు. అదే విధంగా శనివారం కూడా జిల్లా నలుమూలల నుంచి రావడమే కాకుండా గోదావరి జిల్లా జిల్లాల నుంచి కూడా సంప్రదాయ జాన పద కళాకారులు పాల్గొని ప్రజలను ఎంతగానో ఆకర్షించారు. ముఖ్యంగా ఇంతవరకు ఈ జిల్లా ప్రజలకు పరిచయం లేని జానపద కార్యక్రమం దేవర గట్టు ప్రదర్శించి ప్రజల మెప్పును పొందారు. ఈ సందర్భంగా ఆ ప్రదర్శన కథా నాయకుడు రాజ్‌కుమార్‌ను సగౌరంగా సత్కరించారు. అలాగే నారాయణపురం గంగిరెద్దులు, వంగర మండలం జముకుల కథ, బోనెల అసిరయ్య జముకు పాటలు, సాలిన జోగారావు బృందం రెల్లిదోలి చిన్నది నృత్యరూపకం, తగర పువలస చిన్నరెడ్డి బృందం, చీపురుపల్లి సుశీల, మోహనరావులు సామాజిక పాటలు, పీత గంగయ్య తప్పెట గుళ్లు, తోట సిమ్మయ్య తుడుము మేళం, దున్న శకుంత జానపదం, తాసరి తాతారావు అమ్మ రామక్రిష్ణ, మద్దిల ఆదినారాయణ, బోకర గ్రీష్మ, తోట రమణమ్మ, మజ్జి పున్నయ్య, గేదెల రామారావు, సన్నశెట్టి రాజశేఖర్, తెప్పల క్రిష్ణమూర్తి, డాక్టరు కుమార్‌నాయక్, సర్పంచి లక్ష్మీకుమారి, బైనపల్లి లోకనాథం తదితరులు పాల్గొని తమ ఆట పాటలతో సభను రంజింప చేశారు.

క్లుప్తంగా

బ్రిటీష్ పాలకులపై పోరాడిన ఓబన్న

● జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



వడ్డె ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ తదితరులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా చేసిన ఉద్యమంలో వడ్డె ఓబన్న కీలక పాత్ర పోషించారని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. సామాన్యుల హక్కుల కోసం పోరాడిన ఓబన్న జయంతి ఉత్సవాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ హాజరై ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వడ్డె ఓబన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషం వ్యక్తం చేశారు. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటాన్ని గుర్తు చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా వెనుకబడిన సంక్షేమ తరగతులు అధికారిణి బి.అనురాధ, కలెక్టరేట్ ఏవో సూర్యనారాయణ, జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు గుత్తు చిన్నారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న లారీ



ప్రమాద స్థలంలో వాహనాలు

టెక్కలి రూరల్: స్థానిక పాత రవి దాబా సమీపంలో జాతీయ రహదారిపై శనివారం విశాఖపట్నం నుంచి పలాస వైపు వెళ్తున్న కారును ఓ లారీ వెనుక నుంచి అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. పలాసకు చెందిన జి.సురేష్ తన కుటుంబానికి ముగ్గురు మహిళలు, ఇద్దరు పిల్లలతో కలిసి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. అయితే ప్రమాదంలో ఎవరు గాయపడకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. టెక్కలి పోలీసులు సమాచారం అందుకుని వివరాలు నమోదు చేసుకున్నారు.

ఐటీడీఏను తక్షణమే ఏర్పాటు చేయాలి

● మహా ధర్నాలో ప్రజాసంఘాల నాయకులు



ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీలు

మెళియాపుట్టి: మెళియాపుట్టి మండల కేంద్రంలో తక్షణమే ఐటీడీఏను ఏర్పాటు చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని, జిల్లాకు ఐటీడీఏ లేకపోవడం దురదృష్టకరమని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు వంకల మాధవరావు, ఆదివాసీ రాష్ట్ర సంక్షేమ పరిషత్ ఉపాధ్యక్షుడు వాబయోగి అన్నారు. ఐటీడీఏను తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రం మెళియాపుట్టిలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించి.. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాల పునర్విభజనలో భాగంగా శ్రీకాకుళం జిల్లాలోని సీతంపేట ఐటీడీఏ మన్యం జిల్లాలో కలిసిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే మెళియాపుట్టిలో ఐటీడీఏను ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ కార్యాలయం లేకపోవడంతో గిరిజనులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. విభజన సమస్యలు చెప్పుకోవడానికి సుమారు 100 కిలోమీటర్ల దూరంలో పక్క జిల్లాలో ఉన్న సీతంపేటకు వెళ్లాల్సి వస్తోందన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు పలాస, పాతపట్నంలో ఐటీడీఏ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని.. కనీసం ఆ మాటనైన నిలబెట్టుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 16 ఆదివాసీ మండలాలు ఉన్నప్పటికీ ఒక్క మండలం కూడా ఐదవ షెడ్యూల్లో లేకపోవడం బాధాకరమని అన్నారు. మెళియాపుట్టి, మందస, కొత్తూరు, పాతపట్నం మండలాల్లో అధికంగా గిరిజనులు ఉన్నారన్నారు. అనంతరం అధికారులు గిరిజన గ్రామాల్లో నెలకున్న సమస్యలను ఎక్కడికక్కడే వదిలేశారని ఆరోపించారు. రహదారులు, మంచినీరు, విద్య, వైద్య సదుపాయాల్లేక గిరిజనం అవస్థలు పడుతున్నారన్నారు. అత్యధిక గిరిజన గ్రామాలు ఉండి, అన్ని గ్రామాల ప్రజలకు సౌకర్యవంతంగా ఉండే మెళియాపుట్టి మండల కేంద్రంలో ఐటీడీఏ ఏర్పాటు చేస్తే కష్టాలు తీరుతాయన్నారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా అధ్యక్షులు మామిడి భీమారావు, ఆదివాసీ నాయకులు జుత్తు వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

● రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ పోటీలు



క్రీడా జ్యోతిని వెలుగిస్తున్న ఎమ్మెల్యే

కాశీబుగ్గ: క్రీడల్లో అందరూ రాణించాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ జూనియర్ బాల, బాలికల క్రీడా పోటీలు పలాసలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం ప్రారంభించారు. జాతీయ టెన్నీకాయిట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పి.తవిటయ్య అధ్యక్షతన జరిగిన ప్రారంభ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు ఉపయోగించుకొని క్రీడలలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. క్రీడలు అభివృద్ధికి సంబంధించి సంఘ పెద్దలు తమ దృష్టికి తెచ్చిన అన్ని అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఎన్‌సీసీ వలంటీర్ల కవాతు, గాడ్ ఆఫ్ హానర్, పిరమిడ్స్, మార్చ్‌పాస్ట్ అలరించాయి. కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, వైద్యులు డాక్టర్ మల్లేశ్వరరావు, మాజీ ప్రిన్సిపాల్ పున్నయ్య, నాయకులు బడ్డ నాగరాజు, పీరుకట్ల విఠల్, వార్డు కౌన్సిలర్ జోగ త్రివేణిమల్లేష్, 31వవార్డు ఇన్‌చార్జి కొరికాన శంకరరరావు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కె.తారక్, రవిశంకర్ గుప్తా, ఎంఈవో సీహెచ్ శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి కె.సత్యనారాయణ, జిల్లా టెన్నీకాయిట్ కార్యదర్శి ఎస్‌వి జోగారావు, రాష్ట్ర అథ్లెటిక్ టెక్నికల్ కమిటీ చైర్మన్ కె.హరిబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు సీహెచ్ పద్మలోచన, కె.పద్మనాభరెడ్డి, ఎస్.రామారావు, పి.గజేంద్రరావు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి

● మంత్రి అచ్చెన్నాయుడు



మినీ గోకులాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి: పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు. కోటబొమ్మాళి మండలం రేగులపాడు గ్రామంలో రూ. 2.30 లక్షల ఉపాధి నిధులతో నిర్మించిన మినీ గోకులాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పూర్తి స్థాయిలో రోడ్లు వేస్తామని పేర్కొన్నారు. లింగాలపాడులో లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణం చేసి పంటలకు నీరు అందజేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో త్వరలోనే డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామన్నారు. పాఠశాలలు తెరిచే మునుపు అమ్మకు వందనం డబ్బులు అందజేస్తామని స్పష్టం చేశారు. ప్రతీ ఇంటికీ మంచి నీరు, మరుగుదొడ్ల నిర్మాణం చేయడమే లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ జేడీ మురళీధర్, ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్, ఏపీవో హరిప్రసాద్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కె.హరివరప్రసాద్, నాయకులు వి.విజయలక్ష్మి, టి.రామకృష్ణ, ప్రభాకర్ పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడులు

● 1140 లీటర్ల సారా స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సారా తయారీ సామగ్రితో ఆంధ్ర,ఒడిశా ఎక్సైజ్ సిబ్బంది

పాతపట్నం: ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో అక్రమంగా నిర్వహిస్తున్న సారా తయారీ స్థావరాలపై ఆంధ్ర, ఒడిశా ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా శనివారం దాడులు నిర్వహించారు. పాతపట్నం, కొత్తూరు మండలాలకు ఆనుకుని ఉన్న ఒడిశా గ్రామాలైన సింగుపూర్, శిరడా, గురిసింగి గూడ, తమిలీ గూడ, నేరడి గూడ సరిసరాల్లో 1140 లీటర్ల నాటు సారా, 7,400 లీటర్ల తయారీకి సిద్ధంగా ఉంచిన పులియబెట్టిన బెల్లపు ఊటలను గుర్తించి ధ్వంసం చేశారు. సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు పాతపట్నం ఎక్సైజ్ సీఐ కె.క్రిష్టారావు తెలిపారు. సారా తయారీ, విక్రయాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు ఈ సందర్భంగా సీఐ హెచ్చరించారు. దాడుల్లో ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ ఎక్సైజ్ బిభూతి భూషణ, పాతపట్నం, కొత్తూరు, ఆమదాలవలస, నరసన్నపేట, పలాస, శ్రీకాకుళం టాస్క్ ఫోర్స్ ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

8 మంది జూదరుల అరెస్టు

గార: మండలంలోని బలరాంపురం సముద్ర తీర ప్రాంతంలోని తోటల్లో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పట్టుకొని వారి వద్ద నుంచి రూ. 12 వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఆర్.జనార్దన శనివారం తెలిపారు.

కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు

● 11వ తేదీన 265 మంది ఎంపిక



పరుగు పందెంలో అభ్యర్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా ఎచ్చెర్ల ఆర్మడు రిజర్వు మైదానంలో పోలీస్ కానిస్టేబ్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. గత నెల 30వ తేదీ నుంచి ఎంపిక ప్రక్రియ జరుగుతోంది. సెలవు రోజుల్లో మినహా ఈ నెల 18వ తేదీ వరకు ఎంపికలు కొనసాగనున్నాయి. కాగా జిల్లా నుంచి శనివారం 660 మంది ఎంపికకు హాజరు కావల్సి ఉండగా, 414 మంది హాజరయ్యారు. వీరిలో 265 మంది తుది రాత పరీక్షకు ఎంపికయ్యారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో 12 నుంచి 15వ తేదీ వరకు ఎంపిక ప్రక్రియకు పోలీసు ఉన్నతాధికారులు సెలవులు ప్రకటించారు. 16, 17, 18 తేదీలతో ఎంపిక ప్రక్రియ ముగియనుంది. జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఎంపిక ప్రక్రియ పర్యవేక్షించారు. ఎత్తు, ఛాతీ కొలత, 1600, 100 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్ ఈ వెంట్‌ల అర్హత సాధించిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నారు.

ప్రేమ విఫలమైందని ప్రాణం తీసుకున్నాడు!



రామరాజు (ఫైల్)

గార: ప్రేమించిన యువతి కాదనడంతో మనస్తాపంతో యువకుడు పురుగుమందు తాగి ప్రాణం తీసుకొని కన్నవారికి తీరని శోకం మిగిల్చాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గార మండలంలోని నిజామాబాద్ గ్రామానికి చెందిన భైరి రామరాజు (20) విశాఖలోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. తను ఎంతో ఇష్టంగా ప్రేమిస్తున్న యువతి కాదనడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ నెల తొమ్మిదో తేదీన అంపోలు సిస్టమ్ కళాశాల సమీపంలో గడ్డి మందు తాగి ఇంటికి చేరాడు. తల్లి కల్యాణికి అమ్మాయి తన ప్రేమను కాదంటోదని, తట్టుకోలేక గడ్డి మందు తాగేశానని బాధపడుతూ తెలిపాడు. వెంటనే కుటుంబ సభ్యులు శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. శుక్రవారం మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్ల.. శనివారం ఉదయం మృతి చెందాడు. తల్లి భైరి కల్యాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్సై తెలుగు చంద్రమోహన్ తెలిపారు.

కుమార్తె అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు

గార: తన కుమార్తె దమ్ము పూజిత (16) కనిపించడం లేదని తండ్రి దుమ్ము పోలీస్ ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈమె శ్రీకాకుళంలోని బీకేఎస్ కళాశాలలో చదువుతోందని, శుక్రవారం రాత్రి బలరాంపురంలోని తన ఇంట్లోనే అందరితో పాటు పడుకోందని, శనివారం ఉదయం నుంచి కన్పించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నట్లు చెప్పారు. ఎస్ఐ ఆర్.జనార్దన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

23, 24 తేదీల్లో నాక్ బృందం కళాశాల సందర్శన

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలను ఈనెల 23, 24 తేదీల్లో నాక్ పీయర్ టీం సందర్శించనుంది. ఈ నేపథ్యంలో కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులంతా నాక్‌కు మంచి ర్యాంకు వచ్చేందుకు సహకరించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ కోరారు. శనివారం కళాశాలలోని సిల్వర్‌జూబ్లీ ఆడిటోరియంలో పూర్వ విద్యార్థులతో సమావేశాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. నాక్ బృందానికి సహకరించాలని పూర్వ విద్యార్థులకు కోరారు. పూర్వ విద్యార్థుల సంఘ కార్యదర్శి పీవీఎస్ మూర్తి మాట్లాడుతూ.. కళాశాల ఉన్నతికి అందరూ తోడ్పాటు అందించాలన్నారు. కళాశాల అభివృద్ధికి తనవంతు ఆర్థిక సహకారం అందిస్తానని జాయింట్ సెక్రటరీ తంగి మురళీమోహన్ అన్నారు. సమావేశంలో వైస్ ప్రెసిడెంట్ పేర్ల రవి, ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.రామకష్ణ, సురంగి మోహనరావు, విజయభాస్కర్, పీవీ రమణ, సీహెచ్ రామమూర్తి, ఎస్.అరుణ్ కుమారి, ఎ.సూరిబాబు, వ్యాపారవేత్త చేబ్రోలు సురేష్ పాల్గొన్నారు.